బీఆర్ఎస్ మాయ మాటలు నమ్మొద్దు

- కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి



ప్రచార రథంపై మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రజలను కోరారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పీగ్లీపూర్ గ్రామం నుంచి ఎన్నికల ప్రచారానికి శనివారం శ్రీకారం చుట్టారు. మండలంలోని కొత్తగూడెం, బాటసింగారం, జాఫర్‌గూడ, పీర్లగూడెం, మజీద్‌పూర్, గుంతపల్లి, అనాజ్‌పూర్, లష్కర్‌గూడ, గండిచెరువు గ్రామాల మీదుగా ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత బిడ్డగా మీ ముందుకు వస్తున్న.. ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారన్నారు. డబ్బులు, మాయ మాటలతో ప్రజలను మోసం చేయడానికి బీఆర్ఎస్ నేతలు మీ ముందుకు వస్తున్నారని, వారిని అడ్డుకుని కాంగ్రెస్ పార్టీకి బాసటగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్‌రెడ్డిరాంరెడ్డి, ఎంపీపీ బుర్ర రేఖ, జడ్పీటీసీ దాసుగౌడ్, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, ఎంపీటీసీలు బాలమణి, వెంకటేష్, సర్పంచులు వెంకటేష్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌గౌడ్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన వివిధ పార్టీ నాయకులు మల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మరోసారి అవకాశమివ్వండి

- ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



బీఆర్ఎస్‌లో చేరిన తారమతిపేట గ్రామస్తులతో కిషన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా మూడుసార్లు గెలిపించిన మీరే.. మరోసారి అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను అభ్యర్థించారు. ఆయన శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని గువ్వలేటి, చిన్నరావిరాల, బండరావిరాల, సద్దుపల్లి, కవాడిపల్లి, అబ్దుల్లాపూర్‌మెట్, జేఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ రూ.2930 కోట్లతో ఇబ్రహీంపటాన్ని అభివృద్ధి చేశానన్నారు. మరోసారి అవకాశం కల్పిస్తే జిల్లాలోనే ఆదర్శ నియోజకవర్గంగా రూపొందిస్తానన్నారు. తారమతిపేట గ్రామానికి చెందిన పలువురు మంచిరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, సర్పంచులు వనజ, సుజాత, కిరణ్‌గౌడ్, ఎంపీటీసీలు అనిత, వెంకటేశ్‌లతో పాటు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

నేడు మంచాలలో కిషన్‌రెడ్డి ప్రచారం

మంచాల: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రచారం నిర్వహిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని నోముల, లింగంపల్లి, తాళ్లపల్లిగూడ, తిప్పాయిగూడ, చిత్తాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం కొనసాగుతుందన్నారు. మండలంలోని నాయకులు, హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

పేదల పార్టీని గెలిపించండి



ప్రచారంలో టీసీపీఐ అభ్యర్థి మాధవరెడ్డి

మంచాల: బడుగు, బలహీన వర్గాల కోసం పని చేసే పార్టీ టీసీపీఐ అని ఆ పార్టీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థి కొంతం మాధవరెడ్డి అన్నారు. శనివారం ఆరుట్ల, మంచాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో పేదల ఇళ్ల స్థలాల కోసం, రైతాంగ సమస్యలపై, కూలీ రేట్ల పెంపుదలకు టీసీపీఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. పేదల కోసం పని చేసే పార్టీని గుర్తించి బీరువా గుర్తుపై ఓటు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్, జంగయ్య, లింగారెడ్డి, నారాయణ, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు దుకాణాలపై ఎక్సైజ్ శాఖ దాడులు

ఒకరి అరెస్టు,
మద్యం సీసాలు స్వాధీనం

యాచారం: మండల పరిధిలోని చింతపట్లలో శనివారం ఇబ్రహీంపట్నం ఎక్సైజ్ పోలీసులు బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు చేసి గ్రామానికి చెందిన పెంద్యాల యాదయ్యను అరెస్టు చేశారు. అతని నుంచి 13 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యాచారం: గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో మద్యం, నాటు సారా విక్రయిస్తే బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని యాచారం సీఐ సైదయ్య హెచ్చరించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో శనివారం పలు బెల్టు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి 12 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు.

మేడిగడ్డతండాలో అర్ధరాత్రి మూడు ఇళ్లల్లో చోరీ

ఆమనగల్లు: మండలంలోని మేడిగడ్డ తండాలో శుక్రవారం రాత్రి దుండగులు మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. స్థానిక ఎస్ఐ బాల్‌రాం కథనం ప్రకారం.. మేడిగడ్డ తండాలో అర్ధరాత్రి మూడు ఇళ్లలోకి చొరబడిన దొంగలు బీరువాలు పగులకొట్టి 2.7 గ్రాముల బంగారం, 2 కిలోల వెండిని దోచుకెళ్లారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మృతురాలి కుటుంబానికి చేయూత

ఆమనగల్లు: మండలంలోని మంగళికుంట తండాకు చెందిన కేతావత్ జెమిని ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని శనివారం ఎంపీటీసీ దోనాదుల కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.5 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాన్యానాయక్, సత్యంయాదవ్, లాలయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన లింగయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలోకి చికిత్స పొందారు. దీంతో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి శనివారం లింగయ్యను పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఆయనకు రూ.5 వేలు సాయం అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, వార్డు సభ్యులు, నాయకులు ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

కడ్తాల్: జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడప గడపకు తిరిగి పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ రామకృష్ణ, నాయకులు నరేందర్‌రెడ్డి , గణేశ్, రాంచంద్రయ్య, వెంకటేశ్, రవి తదితరులున్నారు.

గెలుపు కోసం ఇంటిల్లిపాది



మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేస్తున్న ఆయన కోడలు మౌనిక



ప్రచారంలో భాగంగా ఓటు అభ్యర్థిస్తున్న బీజేపీ అభ్యర్థి దయానంద్‌గౌడ్ సతీమణి జయలక్ష్మి

- ప్రచారంలో కుటుంబ సభ్యుల మంత్రం

తుర్కయంజాల్: అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగియడంతో కీలకమైన ప్రచారానికి అభ్యర్థులు వ్యూహాలు రచిస్తున్నారు. ప్రచారానికి కేవలం 17 రోజులు మాత్రమే ఉండటంతో ప్రతి ఓటరును నేరుగా కలవడం సాధ్యమవ్వదు. దీంతో ఎలాగైనా తమ వారిని గెలిపించుకోవాలనే కాంక్షతో కుటుంబసభ్యులు రంగంలోకి దిగారు. ఆయా పార్టీల నాయకులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ తమ వారిని గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. అంది వచ్చిన అవకాశాలన్నీ ఉపయోగించుకుంటూ ఓటు వేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా యువ ఓటర్లను ఆకర్షించడంలో కుటుంబసభ్యుల పాత్ర అధికమయింది.

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తరఫున ఆయన కుమారుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డితో పాటు, కోడలు మౌనిక, కూతురు శ్రీలత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల్లో మరోసారి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతున్నారు.
- బీజేపీ అభ్యర్థి నోముల దయానంద్‌గౌడ్ తరఫున ఆయన సతీమణి జయలక్ష్మి, కుమారులు కార్తీక్‌గౌడ్, భరత్‌గౌడ్, కూతురు జ్యోతి, కోడళ్లు లాస్య, మానసతో పాటు పలువురు కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొని ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.
- కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి తరఫున ఆయన సతీమణి అనుసూయతో పాటు తమ్ముడు మల్‌రెడ్డి రాంరెడ్డి, మరదలు అనురాధ, కొడుకు అభిషేక్‌రెడ్డి, కోడలు స్నేహ, మేనల్లుడు వంగేటి గోపాల్‌రెడ్డి జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

మహిళలకు చేయూత



కుట్టు మిషన్ అందజేస్తున్న చెన్నకిషన్‌రెడ్డి

కడ్తాల్: లయన్స్ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని క్లబ్ జిల్లా మాజీ గవర్నర్, ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ చెన్నకిషన్‌రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ బాలాజీనగర్ ఆధ్వర్యంలో, మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, లయన్ సుధా చెన్నకిషన్‌రెడ్డి, చేగూరి వెంకటేశ్, డాక్టర్ రమేశ్, రాజు, మహేశ్, పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడ్తాల్: మండల కేంద్రంలో శనివారం లయన్స్‌క్లబ్ బాలాజీనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు సంయుక్త ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి, సాయి దీక్షిత్‌రెడ్డి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ పూజలు



కడ్తాల్: ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కడ్తాల్: మండల పరిధిలోని అన్మాస్‌పల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో శనివారం జర్పుల సాలిరాజునాయక్, హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకం, అలంకరణ, పత్రిపూజ, హనుమాన్ చాలీసా పారాయణం తదితర కార్యక్రమాలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో గిరిజనమోర్చ రాష్ట్ర కార్యదర్శి శంకర్‌నాయక్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, రాజు, పత్యా పాల్గొన్నారు.

ఆలయ భూమిపై ఆరోపణలు మానుకోవాలి



ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మంచిరెడ్డి

- అభివృద్ధిని చూసి ఓటేయండి
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూమిపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హెచ్చరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి మండలంలోని నస్దిక్‌సింగారం గ్రామంలో రోడ్ షోలో ఆయన మాట్లాడుతూ.. కొందరు తనపై ఓంకారేశ్వరాలయ భూములు లాక్కుంటున్నారని, టీఎస్ఐఐసీకి ఇచ్చేస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఈ భూములపై కోర్టుకు వెళ్లింది ఎవరని ప్రశ్నించారు. భూములను సాగు చేస్తున్న కౌలు రైతులకు న్యాయం చేస్తానన్నారు. దేవాదాయ శాఖ అధికారులు ఆలయ భూముల సర్వేకు వస్తే నిలిపేసింది తానేనన్నారు. తను ఎవరికీ అన్యాయం చేసే వ్యక్తిని కాదన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి కారు గుర్తుకు ఓటేసి మరోసారి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, గ్రామ సర్పంచ్ వన్నెవాడ అరుణమ్మ, ఉప సర్పంచ్ వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి



లింగంపల్లిలో కవాతు చేస్తున్న పోలీసులు

మంచాల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో పోలీసుల కవాత్ నిర్వహించారు. శనివారం మంచాల సీఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో నోముల, లింగంపల్లి, చిత్తాపూర్, తాళ్లపల్లిగూడ గ్రామాల్లో పారా మిలటరీ బలగాలు ప్రదర్శన చేశాయి. సీఐ మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు రవినాయక్, లాలయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పుడు చేయలేదు.. ఇప్పుడెలా చేస్తారు?

- బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మరు



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న కాలె యాదయ్య

చేవెళ్ల: ఏళ్ల తరబడి అధికారంలోఉన్న పార్టీలు చేయలేని అభివృద్ధి పనులు ఇప్పుడు ఎలా చేస్తారని బీఆర్ఎస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ప్రశ్నించారు. ఆలూరు, మీర్జాగూడ, బస్తేపూర్ గ్రామంలో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్, బీజేపీ ఇచ్చే హామీలను నమ్మొద్దన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత కేసీఆర్ నాయకత్వంలో గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. తమకు మరోసారి అవకాశం కల్పిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలూరు సర్పంచ్ విజయలక్ష్మీ, మీర్జాగూడ సర్పంచ్ భీమయ్య, బస్తేపూర్ సర్పంచ్ నర్సింలు, ఉప సర్పంచ్ కసిరే వెంకటేశ్, ఎంపీటీసీ యాదమ్మ, యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, జెడ్పీటీసీ ఎం. మాలతి, వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ ఎంపీపీ ఎం. బాల్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతలను అడ్డుకున్న తండావాసులు



నాయకులతో యువకుల వాగ్వాదం

ఆమనగల్లు: మండల పరిధిలోని దయ్యాలబోడు తండాలో శనివారం బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులను తండా యువకులు అడ్డుకున్నారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పానుగోటి అర్జున్‌రావ్, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, శంకరకొండ తండా ఉపసర్పంచ్ ప్రశాంత్‌నాయక్ తదితరులు ప్రచారానికి వెళ్లారు. ప్రచారం నిర్వహిస్తుండగా బీఆర్ఎస్ నేతలను కొందరు యువకులు అడ్డుకున్నారు. తమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయలేదని, ఎన్నికల సమయంలో మాత్రం నాయకులు వచ్చి పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, శంకరకొండ తండా మధ్య వంతెన నిర్మాణం ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు యువకులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

బహుజన రాజ్యంతోనే సమన్యాయం

మాడ్గుల: బహుజన రాజ్యంతోనే అభివృద్ధి సాధ్యమని కల్వకుర్తి బీఎస్పీ అభ్యర్థి కోముము శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని నాగిళ్ల గ్రామంలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుజనులకు సమన్యాయం జరగాలంటే అధికారంతోనే సాధ్యమన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు అధిక సీట్లు కేటాయించిన బీఎస్పీని గెలిపించాలని కోరారు. పార్టీ నేతలు కొండల్ యాదవ్, మహేష్, సాయి, వేంకటేష్, బాలాజీ, శంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు కరాటే శిక్షణ తరగతులు



కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ సోను

ఆమనగల్లు: మండలంలోని మాలెపల్లిలో విద్యార్థులకు ఉచిత శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. మాజీ సర్పంచ్ వెంకటరమణారెడ్డి, స్థానిక నాయకులు రవికుమార్‌ల సహకారంతో కరాటే మాస్టర్ సోను విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తారు. కార్యక్రమంలో రాములు, లక్ష్మయ్య, రామస్వామి, వెంకటేశ్, మహేశ్, మల్లేశ్, శ్రీను, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ పాలన నుంచి విముక్తి కల్పించాలి

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్



సీతారాంపూర్‌లో ఎన్నికల ప్రచారంలో పీసరి సురేందర్‌రెడ్డి, కావలి చంద్రశేఖర్

షాబాద్: జూటా మాటలతో గద్దెనెక్కుతూ, ప్రజలను మోసం చేస్తున్న కల్వకుంట్ల కుటుంబ పాలన నుంచి రాష్ట్రానికి విముక్తి కల్పించాలని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం రాత్రి షాబాద్ మండల పరిధిలోని సీతారాంపూర్ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఉచితంగా ఆర్టీసీలో ప్రయాణం, రైతుబంధు కింద ఎకరానికి రూ.16 వేలు, కౌలు రైతులకు రూ.12 వేలు వంటి పథకాలను అమలు చేస్తామన్నారు. గడిచిన తొమ్మిదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు చేసిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, రవీందర్, పామెన నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

దక్కారే.. దక్కా హ్యాట్రిక్ పక్కా

సీడీ ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్



ఆడియో క్యాసెట్ ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్ రెడ్డి పాడించిన దక్కారే..దక్కా హ్యాట్రిక్ పక్కా పాటల సీడీని శనివారం నగరంలోని ప్రగతి భవన్‌లో మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌పల్లి ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి, యువజన నాయకులు పాల్గొన్నారు.

ప్రజల చూపు కాంగ్రెస్ వైపే



తలకొండపల్లి: కసిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన చుక్కాపూర్ సర్పంచ్



ఆమనగల్లు: ప్రచారంలో భాగంగా కుందారం తండాలో మాధవిరెడ్డి

- కల్వకుర్తిలో హస్తం జెండా ఎగురవేస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కల్వకుర్తి కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కాంగ్రెస్‌తోనే ప్రజలందరికీ సమన్యాయం జరుగుతుందన్నారు. మండల పరిధిలోని చుక్కాపూర్, గద్దగుండ్ల తండా, తాళ్లగుట్ట తండా, పాతకోట తండా, పడమటి తండా, చెన్నారం, ఎడవెల్లిలో శనివారం కసిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార పార్టీకి చెందిన చుక్కాపూర్ గ్రామ సర్పంచ్ దాసరి కిష్టమ్మ తన అనుచరులతో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కసిరెడ్డి మాట్లాడుతూ.. గత తొమ్మిదిన్నర ఏళ్లలో రాష్ట్రంలో అవినీతి పేరుకుపోయిందన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ గెలుపును ఎవరూ ఆపలేరని, కల్వకుర్తిలో భారీ మెజార్టీతో విజయం సాధిస్తామన్నారు. నాయకులు సమష్టిగా కృషి చేసి పార్టీని గెలిపించాలన్నారు. సీఎం కేసీఆర్‌ను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు మోహన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భగవాన్‌రెడ్డి, అంజయ్యగుప్తా, యాదయ్య, నర్సింహా, రఘురాములు, రంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశమివ్వండి

ఆమనగల్లు: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి మాధవీరెడ్డి కోరారు. మాడ్గుల, వెల్దండ మండలాలలోని పలు గ్రామాలు, తండాలలో శనివారం స్థానిక నాయకులతో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరుగుతూ ఆరు గ్యారంటీల పథకాన్ని ప్రజలకు వివరించారు. ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కసిరెడ్డితోనే సాధ్యమన్నారు. భారీ మెజార్టీతో తన భర్తను గెలిపించాలని అభ్యర్థించారు.